ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పలు సమస్యలపై 8 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి ఎస్‌పి స్వయంగా వినతులు స్వీకరించి విచారణ చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఫిర్యాదులను ఆయా స్టేషన్లకు బదలాయిస్తూ సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి రవిప్రకాష్

ఆగ్రహ జ్వాల..

అంగన్వాడీల పట్ల ప్రభుత్వం దౌర్జన్య ఖాండ మెగించింది. మహిళలని చూడకుండా దుర్మార్గంగా వ్యవహరించింది. ఇదేమని ప్రశ్నిస్తే అడ్డగోలుగా ప్రవర్తించి పైశాచికత్వాన్ని చూపించింది. దీంతో అంగన్వాడీల్లో ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. విజయవాడ వెళ్లనివ్వకుండా ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. జిల్లా నుంచి తరలివెళ్లిన అంగన్వాడీలు, నేతలను ఎక్కడికక్కడ అరెస్టు చేసింది. 2000 వేల మంది అంగన్వాడీలు, నేతలను వివిధ పోలీస్ స్టేషన్లో, కళాశాలలు, కళ్యాణ మండపాలకు తరలించి నిర్బంధించింది. ఈ నేపథ్యంలో జిల్లా అంతా నిరసనలు హోరెత్తాయి. అక్రమ నిర్బంధం, అరెస్టులను సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐయు, టిడిపి, జనసేన, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

విజయవాడ వెళ్తున్న గోపాలన్‌ను మధ్యలో ఆపి ఈడ్చుకెళ్తున్న పోలీసులు

విజయవాడ వెళ్లనివ్వకుండా అష్ట దిగ్బంధనం
ఎక్కడికక్కడ నిర్బంధం, అక్రమ అరెస్టులు
జిల్లా నుంచి తరలివెళ్లిన 2000 మంది అంగన్వాడీలు
మధ్యలో అడ్డగించిన పోలీసులు
పోలీస్ స్టేషన్లు, కళ్యాణ మండపాలు , కళాశాలల్లో నిర్బంధం
సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐయు, టిడిపి, జనసేన, ప్రజా సంఘాలు ఖండన

ప్రజాశక్తి - భీమవరం

42 రోజుల నుంచి అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా స్పందించని ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి విజయవాడ తరలివెళ్తున్న అంగన్వాడీలను వెళ్లనీయకుండా అష్ట దిగ్బంధనం చేసింది. విజయవాడ వెళ్లే సరిహద్దుల్లో చెక్ పోస్టులు పెట్టి మరీ వారికోసం జల్లెడ పట్టింది. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి అన్నిచోట్లా విస్తృత తనిఖీలు చేపట్టింది. ఆదివారం నుంచి అంగన్వాడీలు విజయవాడ వెళ్లారు. సోమవారం కూడా వేలాది మంది బయలుదేరారు. ఈ నేపథ్యంలో పోలీసులు నిర్బంధాన్ని ముమ్మరం చేశారు. కొంతమంది అంగన్వాడీలు, నేతలను ఆదివారం తెల్లవారుజాము నుంచే ముందస్తుగా నిర్బంధించి నోటీసులు అందజేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు. మహిళలని చూడకుండా రాత్రంతా పోలీస్‌స్టేషన్లోనే నిర్బంధించారు. అయితే నిర్బంధాన్ని సైతం అధిగమించి అంగన్వాడీలు, నేతలు విజయవాడ తరలివెళ్లారు. జిల్లాలోని ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సుమారు 2000 మంది అంగన్వాడీలు విజయవాడ ప్రయాణమై వెళ్లారు. అయితే విజయవాడ వెళ్లకుండానే పోలీసులు కట్టుదిట్టమైన భద్రత మధ్య బస్సులు, వాహనాలను నిలుపుదల చేసి విస్తృత తనిఖీలు చేపట్టి అంగన్వాడీలను అడ్డుకున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.రాజా రామ్మోహన్ రాయ్, జెఎన్‌వి.గోపాలన్, పి.ప్రతాప్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, నేతలు హసీనా తులసీతో పాటు మరికొంతమంది నేతలు, అంగన్వాడీలను విజయవాడలో అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే జిల్లా నుంచి వెళ్లిన అంగన్వాడీలను పోలీసులు మధ్యలో అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నూజివీడు ఐఐటి కళాశాలలో జిల్లాకు చెందిన 300 అంగన్వాడీలను నిర్బంధించారు. ఏలూరు జిల్లాలో రెండు కేంద్రాల్లో 150 మందిని, విజయవాడలో 25 మందిని, మచిలీపట్నం పోలీస్ ట్రెయినింగ్ సెంటర్లో 300 మందిని, కైకలూరు నిజాముద్దీన్ కళాశాలలో 150 మందిని, చేబ్రోలులో 150 మంది అంగన్వాడీలను నిర్బంధించారు. నరసాపురంలో 70 మంది అంగన్వాడీలను అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భీమవరం టౌన్ స్టేషన్లో 23 మందిని, భీమవరం రూరల్ స్టేషన్లో 20 మందిని, మరో స్టేషన్లో ఏడుగురిని, కాళ్ల పోలీస్‌స్టేషన్లో ఏడుగురిని, పోడూరులో 50 మందిని, తాడేపల్లిగూడెంలో 30 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ నేపథ్యంలో జిల్లా అంతటా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అంగన్వాడీలు నిరసన పోరు మిన్నంటాయి. పోలీస్ స్టేషన్ల వద్ద అంగన్వాడీలు, నేతలు నిరసనలు చేపట్టి అక్రమంగా నిర్బంధించి అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులను సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎన్‌సిపిఐయు, టిడిపి జనసేన, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. జిల్లా కేంద్రం భీమవరంలో అంబేద్కర్ సెంటర్ వద్ద రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి నేతలు కలెక్టరేట్ ఎఒ అప్పారావుకు వినతి పత్రం అందజేశారు.

ఈ నెల 24న కార్మిక సంఘాలు చేపట్టిన అంగన్వాడీల రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతి బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ తరపున వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల జగన్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 24న కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతిస్తామని, దళిత ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భీమవరం రూరల్ : సామాజిక న్యాయం, మహిళా సాధికారత అని గొప్పలు చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డికి అంగన్వాడీల్లో ఆ రెండు నినాదాలు కనిపించడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రశ్నించారు. అంగన్వాడీలు, నేతల అక్రమ అరెస్టులను ఖండించారు. సోమవారం సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంసిపిఐ(యు), టిడిపి, జనసేన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. అక్రమంగా అరెస్టులు చేసిన నాయకులను, అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా నాయకురాలు డి.కళ్యాణి, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి కోనాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు లంకా కృష్ణమూర్తి మాట్లాడారు. అనంతరం ర్యాలీగా టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించి అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విడుదలైన అంగన్వాడీలతో కలిసి ర్యాలీగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా తాలూకా ఆఫీస్ రోడ్డు నుండి సిఐటియు కార్యాలయం వరకూ వెళ్లారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, పట్టణ ప్రజల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, ఎఐటియుసి నాయకులు చెల్లబోయిన రంగరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, బి.జార్జి, కౌలురైతు సంఘం నాయకులు ఎంరామాంజనేయులు, కెవిపిఎస్, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

భీమవరంలో రాస్తారోకో నిర్వహిస్తున్న నేతలు

మొగల్తూరు : అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోరుతూ మొగల్తూరులో చేపట్టిన దీక్షలు 42వ రోజు కొనసాగాయి.

ఆచంట : ఈ నెల 24వ తేదీన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు పిలుపునిచ్చారు. ఆచంట మండలం నుంచి విజయవాడ వెళ్తున్న సుమారు 40 మంది అంగన్వాడీలను మధ్యలో పోలీసులు అరెస్టులు, నిర్బంధాలు చేయడం దారుణం అన్నారు.

తాడేపల్లిగూడెం : అంగనవాడీలు, నేతలను అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని సిఐటియు పట్టణ కమిటీ తీవ్రంగా ఖండించింది. పట్టణ పోలీసు స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్ల వద్ద నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు, సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, కాలపురెడ్డి కొండలరావు, పి.నాగేంద్రబాబు, యడవల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

పాలకొల్లు : విజయవాడలో జరిగే అంగన్వాడీల సభకు పాలకొల్లు నుంచి వెళ్తున్న 25 మంది అంగన్వాడీలను సోమవారం పట్టణ సిఐ డి.రాంబాబు ఎస్ఐ ముత్యాలరావు అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకూ వారిని స్టేషన్‌లోనే ఉంచారు. వారిపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నరసాపురం : విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు రైల్వేస్టేషన్, బస్టాండ్లలో అరెస్టు చేయడం, నిర్బంధించడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు అన్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో పొగాకు పూర్ణ, పొన్నాడ రాము, పొగాకు నారాయణ రావు, నోముల కొండ, నరేష్, కడలి రవి పాల్గొన్నారు. అయితే నరసాపురం నుంచి విజయవాడ వెళు తున్న 30 మంది అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేసి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లో నిర్బంధించారు.

అంగన్వాడీలపై ప్రభుత్వ దమనకాండను రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలపై పోలీసులు దమన కాండకు పాల్పడం దారుణమన్నారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఉద్యోగాల నుండి తీసి వేస్తాననడం జగన్ చేతకాని తనానికి నిదర్శనమని విమర్శించారు.

ఉండి : బెదిరింపులు, హెచ్చరికలతో ప్రభుత్వం తమ ఉద్యమాన్ని ఆపలేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.చైతన్య, డి.సత్యవేణి అన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని వారు హెచ్చరించారు.

యలమంచిలి : అంగన్‌వాడీల సమ్మెకు ఐద్వా, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ సంఘాలతోపాటు సిపిఎం మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దేవ సుధాకర్, ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, డివైఎఫ్ఐ నాయకులు తెన్నేటి స్టాలిన్, విప్పర్తి అవినాష్, అనిల్ పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలోని అంగన్వాడీలకు ఆదివారం రాత్రి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం విజయవాడలో నిరవధిక దీక్ష చేస్తున్న అంగన్వాడీలకు మద్దతుగా ఉద్యమించేందుకు బయలుదేరిన కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

తణుకు రూరల్ : అరెస్ట్ చేసిన అంగన్వాడీలను, సిఐటియు నాయకులను వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో నేతలు, అంగన్‌వాడీల అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక నరేంద్ర సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, కడలి వీరారాజు, ఎ.ఆంజనేయులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్తున్న ప్రతాప్‌ను ఈడ్చుకుంటూ తీసుకెళ్తున్న పోలీసులు

ఆకివీడు పోలీస్ స్టేషన్లో అంగన్వాడీలు

పాలకొల్లు రైల్వే స్టేషన్లో అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో ఓటర్లు 14,61,338 మంది

ఓటర్ల తుది జాబితా విడుదల: కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాల విభజనలో ఏర్పాటైన పశ్చిమగోదావరి జిల్లా నూతన ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 14,61,338 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 7,16,956 మంది, మహిళా ఓటర్లు 7,44,308 మంది, జెండర్లు 74 మంది ఉన్నారు. ముఖ్యంగా జిల్లాలో 31,819 మంది యువ ఓటర్లు నూతనంగా ఓటు హక్కు పొందారు. కలెక్టరేట్లో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం జిల్లాకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ విడుదల చేశారు. ఈ ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ కార్యాలయం, అన్ని నియోజకవర్గాల్లోని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల కార్యాలయాల్లో, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల కార్యాలయాల్లో, జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రచురించినట్లు ప్రశాంతి తెలిపారు. ఆచంట నియోజకవర్గంలో పురుష ఓటర్లు 88,319 మంది, మహిళా ఓటర్లు 90348 మంది, థర్డ్ జెండర్ ఓటర్ ఒకరు కలిపి మొత్తం 17,8668 మంది, పాలకొల్లులో పురుషులు 95,079, మహిళలు 98,293, థర్డ్ జండర్ ఏడుగురు కలిపి 1,93,379 మంది, నరసాపురంలో పురుషులు 83,755 మంది, మహిళలు 84,442 మంది కలిపి 1,68,187 మంది ఉన్నారని తెలిపారు. భీమవరంలో పురుషులు 1,22,228, మహిళలు 129023 మంది, థర్డ్ జండర్లు 50 మంది కలిపి 2,51,301 మంది, ఉండిలో పురుషులు 109414 మంది, మహిళలు 113583 మంది, థర్డ్ జండర్ ఇద్దరితో కలిసి 2,22,999 మంది, తణుకులో పురుషులు 113780 మంది, మహిళలు 119296 మంది, థర్డ్ జెండర్ ఆరుగురితో కలిపి 2,33,082 మంది ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి 31,819 మంది యువ ఓటర్లను చేర్పించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిడబ్ల్యుడి ఓటర్ల నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 20132 డబ్ల్యుడి ఓటర్లను నమోదు చేశామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు ఫిర్యాదులను పూర్తిగా విచారణ చేసి డూప్లికేట్ ఓటర్లను తొలగించామన్నారు. తుది జాబితాను ప్రచురణ అనంతరం కూడా ఏదైనా క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వై.దుర్గా కిషోర్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న డిఆర్ఒ శివన్నారాయణ రెడ్డి

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా రెవెన్యూ అధికారి శివన్నారాయణ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలలా ప్రజల నుంచి వచ్చిన 146 దరఖాస్తులను జిల్లా రెవెన్యూ అధికారి శివన్నారాయణ రెడ్డి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్.ప్రసాద్‌యాదవ్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మళ్లీ రీ ఓపెన్ అవ్వని విధంగా కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి మనపై నమ్మకంతో వస్తారని, దాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ అప్పిలేటు మెంబరు మేళం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్‌పి ఛైర్ పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ ప్రశాంతి

తరగతి గది నుంచే దేశ ప్రగతి ప్రారంభం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశ ప్రగతి తరగతి గది నుంచే ప్రారంభమవుతుందని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్ వద్ద పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ముఖ్యఅతిథిగా జెడ్‌పి ఛైర్ పర్సన్ పద్మశ్రీ పాల్గొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్ హైస్కూళ్లలో చదువుతున్న సుమారు 13,500 మంది విద్యార్థులకు విజయకేతనం పేరుతో ముద్రించిన పదో తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్ పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యతోనే ప్రగతి అని కోట్ల రూపాయలు విద్య కోసం ఖర్చు చేస్తున్నారన్నారు. అమ్మఒడి, విద్యార్థులకు దుస్తులు, షూస్, బెల్ట్‌లు తదితర వస్తువులతో పాటు, ట్యాబ్‌లు అందజేయడం, పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి, గోరుముద్ద వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదిలో మంచి ఫలితాలు సాధించి బహుమతిగా ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే జీవితం స్థిరపడుతుందన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తేనే గర్వంగా ఉంటుందన్నారు. పరీక్షలు రాసే సమయంలో అందంగా, అర్థమయ్యే రీతిలో రాయడం, అండర్ లైన్ చేయడం వంటివి కూడా ప్రధానమన్నారు. సోషల్ మీడియా, సెల్ ఫోన్లు, స్నేహితులతో ఆటలతో గడపకుండా రానున్న 40 రోజులు పట్టుదలతో చదివి మంచి విజయాలు సాధించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, పశ్చిమ, ఏలూరు జిల్లాల డిఇఒలు ఆర్.వెంకటరమణ, పి.శ్యాంసుందర్, భీమవరం జెడ్‌పిటిసి కె.నరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, జిల్లా పరిషత్ సిఇఒ కెఎస్ఎస్ సుబ్బారావు, పశ్చిమ జిల్లా డిఇఒ ఆర్.వెంకట రమణ పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లారు..!

తూతూమంత్రంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక
అభ్యంతరాలు, ఫిర్యాదులపై విచారణ కరువు
అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు : డ్వామా పీడీ రాజేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఎన్ఆర్జీఎస్ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశానికి అధికారులు వచ్చారు, వెళ్లారు అన్నట్లుగా సాగింది. సామాజిక తనిఖీ నిర్వహణను తూతూ మంత్రంగా నిర్వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమావేశంలో వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులపై విచారణ పూర్తిస్థాయిలో జరగలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభించిన గంటన్నర వ్యవధిలోనే సమావేశాన్ని పూర్తిచేసి అధికారులు ఎక్కడికక్కడే జారుకున్నారు. దీనిపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ చట్టంలో గత ఏడాది జరిగిన పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ ఇటీవల గ్రామంలో జరిగింది. దీనిలో భాగంగా ఎంపిడిఒ ఎం.నాగేంద్రకుమార్ అధ్యక్షతన సోమవారం ఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లలకోడేరు, శృంగవృక్షం గ్రామాల్లో తక్కువ సంఖ్యలో మొక్కలు నాటి ఎక్కువ సంఖ్యలో వేసినట్లు గుర్తించారు. పలు గ్రామాల్లో పనులు చేసిన కూలీలకు బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కావడం లేదని నివేదికల్లో పేర్కొన్నారు. అయితే వచ్చిన అంశాలపై కనీస విచారణ చేయకుండానే తమకు ఎందుకులే అన్నట్లుగా అధికారులు వ్యవహరించిన తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవకతవకలకు పాల్పడితే చర్యలు : డ్వామా పీడీ రాజేశ్వరరావు

ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనుల్లో అక్రమాలు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు సిబ్బందిని హెచ్చరించారు. తప్పుడు మస్తర్లు, పనులు జరగకుండా జరిగినట్లు చూపి బిల్లులు పెట్టడం వంటి ఫిర్యాదులు వస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా వేదికకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా రూ.142 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. నిర్మాణ సామగ్రి కింద రూ.47 కోట్లు, కూలీలకు రూ.88 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉద్యాన పంటలు, చెరువు, గుంతల తవ్వకాల పనులను ఎక్కువగా చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఎపిడి వి.విజయలక్ష్మి, విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఎన్ఆర్ఆజీఎస్ ఈసీ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ జయ బాబు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు అందిస్తున్న దాతలు

పాఠశాలకు తాగునీటి ట్యాంకు వితరణ

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు దాతలు మంచినీటి ట్యాంకు అందించారు. గ్రామ ప్రముఖులు, ఆకివీడు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు తోట భుజంగరావు ఆయన కుమారుడు వెంకటాచలంలు ఈ ట్యాంకును ఏర్పాటు చేశారు. సుమారు రెండు వేల లీటర్ల సామర్థ్యం గల ఈ ట్యాంకర్ సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందన ప్రభాకరరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, మోహన వెంకట శివ సాయి పాల్గొన్నారు.



సర్పంచి వెంకటేశ్వరరావును అభినందిస్తున్న గుడాల గోపీ

వెలివెల సర్పంచిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వెలివెల గ్రామం గ్రామ పంచాయతీ సర్పంచిగా కందుల వెంకటేశ్వరరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో వైసిపికి చెందిన ఇద్దరు నాయకులు సర్పంచి పదవికి పోటీపడ్డారు. వారిని వైసిపి నాయకత్వం ఒప్పించి ముందుగా సర్పంచి పదవి చేపట్టిన కెల్ల సింహాచలంకు 25 నెలలు పదవిలో కొనసాగే విధంగా, ఆ తర్వాత 35 నెలలు కందుల వెంకటేశ్వరరావు సర్పంచి పదవిలో కొనసాగే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం తెల్ల సింహాచలం తన సర్పంచి పదవికి రాజీనామా చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచి కందుల వెంకటేశ్వరరావును వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపీ) అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు మేకశేషు బాబు, వైసిపి ప్రెసిడెంట్ గూడూరు వెంకట నరసింహరావు, మన్నే కోటేశ్వరరావు, గుమ్మాపు వరప్రసాద్, కందుల నాగేశ్వరరావు, బోడపాటి వెంకట్ నారాయణ పాల్గొన్నారు.

24 నుంచి నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఆచంట

ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఫైనల్ మ్యాచ్‌లు ఈ నెల 24వ తేదీ నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నరసింహప్రసాద్ తెలిపారు. ఈ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 24వ తేదీన కొడమంచిలి హైస్కూల్‌లో మహిళలు, పురుషులకు వాలీబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. 25వ తేదీన మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రికెట్ పోటీలు, 27న వల్లూరు ఎంపీపాలెం హైస్కూల్లో మహిళలు, పురుషులకు బ్యాడ్మింటన్, కోకో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29న మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్నటుల తెలిపారు.

రక్తదానంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉండి

రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, అనారోగ్యాలు సంభవిస్తాయనే అపోహ వద్దని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఉండి చిక్కాల వీరన్ననగర్ కాలనీలో జనసేన పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి కంది దుర్గాప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎంఎల్ఎ రామరాజు సందర్శించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు. ఆరోగ్యవంతమైన పురుషులు మూడు నెలలకు ఒకసారి, ఆరోగ్యవంతమైన స్త్రీలు నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని చెప్పారు. ఒకసారి రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన దుర్గాప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు యడవిల్లి వెంకటేశ్వరరావు, నాయకులు మంతెన సాయి లచ్చిరాజు, కాగిత మహంకాళి, కిన్నెర వెంకన్న, కాగిత బుజ్జి, మజ్జి కృష్ణప్రసాద్, యర్రా రవి, అడపా గణేష్, కంకణాల బాలకృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

శిశువు చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో రెస్ట్ హౌస్ రోడ్డు 28వ వార్డుకు చెందిన తామరాపు వెంకటరమణ, ప్రియ దంపతులకు కొన్ని రోజుల క్రితం బాబు జన్మించాడు. ఈ బాబుకు ఆక్సిజన్ అందక ఇంపరియల్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం బాక్స్‌లో పెట్టారు. దాని నిమిత్తం జెపి ఫౌండేషన్, దాతల సహకారంతో రూ.50 వేల నగదును జనసేన జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు చేతులమీదుగా సోమవారం వారి తల్లితండ్రులకు అందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మమని జయప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షులు చల్లా రాము, చింతా లక్ష్మణ్, నాగిడి శ్యామ్, జాడ చిన్న, ములగాల సంజయ్, బొంతు శ్రీను, ఎక్కుల దుర్గారావు, ఎక్కుల దాన్నయ, అబోతుల రాము, పోసిన బాబి, బుడ్డ మావుళ్లు, జన సైనికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఉండి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం తమ బాధ్యత అని యండగండి సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని యండగండి గ్రామ పంచాయతీలో 12 మందికి నూతనంగా మంజూరైన రైస్ కార్డులను విఆర్‌ఒ గణపతిరావు సమక్షంలో సర్పంచి చిన్న కృష్ణమూర్తి అందించారు. ఈ సందర్భంగా చిన్న కృష్ణమూర్తి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

నేరాలు - ఘోరాలు

జాతరలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

ఇద్దరికి గాయాలు

పోలీసు పహరా ఏర్పాటు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో ఉన్న సత్తెమ్మ వారి జాతరలో సోమవారం సాయంత్రం ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ జరగడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతి మూడేళ్లకోసారి గ్రామంలో సత్తెమ్మ జాతర నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఆ ప్రాంతవాసులు రెండు గ్రూపులుగా వీడి వేర్వేరుగా జాతరను నిర్వహించారు. సత్తెమ్మ ఆలయం వారు నిర్వహించిన జాతర ముగింపు సందర్భంగా అమ్మవారిని ఊరేగించి సంప్రదాయం ప్రకారం గద్దె దించే ప్రాంతంలో మరో గ్రూపు వారు అమ్మవారిని నిలబెట్టారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో ఒక గ్రూపు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇరుగ్రూపుల పెద్దలతో చర్చించారు. అమ్మవారిని రావి చెట్టు కింద దింపాలని ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో ఒక గ్రూపు వారు మరో గ్రూపువారి కళ్లలో కారం చిమ్మి కొట్లాటకు దిగడంతో ఇద్దరికి తీవ్ర గాయాలపాలయ్యారు. గాయాలపాలైనవారిని స్థానికులు 108 వాహనంలో నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసాపురం ఎస్ఐ గురవయ్య, మొగల్తూరు ఇన్‌ఛార్జి ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఇరు గ్రూపులను చెదరగొట్టి పోలీస్ సిబ్బందితో పహరా ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ముగిసిన జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

విజేతలకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - నరసాపురం

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిగా ఉండాలని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. నరసాపురం గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల ముగింపు వేడుకలకు సుబ్బారాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 30 ఏళ్ల నుంచి విజయవంతంగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఈ జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు దేశంలోనే వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా గత 30 సంవత్సరాల నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పురుష విభాగంలో ప్రథమ నగదు బహుమతి రూ.లక్షను హర్యానా జట్టు, ద్వితీయ నగదు బహుమతి రూ.75 వేలు రాజస్థాన్ జట్టు, తృతీయ నగదు బహుమతి రూ.50 వేలు ఆంధ్రా జట్టు, నాలుగో నగదు బహుమతి రూ.25 వేలు వెస్ట్ బెంగాల్ జట్టులు కైవసం చేసుకున్నాయి. మహిళా విభాగంలో కోల్‌కత్తా ప్రథమ స్థానం రూ.లక్ష నగదు బహుమతి, కేరళ ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి ఆంధ్రప్రదేశ్ రూ.50 వేలు, నాలుగో బహుమతి హిమాచల్ ప్రదేశ్ రూ.25 వేలు సాధించారు. విజేతలకు కొత్తపల్లి సుబ్బారాయుడుతో పాటు మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్, కొత్తపల్లి నాని, నాయకులు నెక్కంటి సుబ్బారావు, దొండపాటి స్వాములు, వన్నెం రెడ్డి శ్రీనివాస్, గుగ్గిలపు మురళి, యాదంరెడ్డి మహేష్, గోగులమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందించారు.

కోల్‌కత్తా జట్టుకు ప్రథమ బహుమతి అందిస్తున్న సుబ్బారాయుడు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పోడూరు

వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓటర్ లిస్టలను మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం నోటీస్ బోర్డులో ఉంచినట్లు తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత బిఎల్‌ఒలకు తెలియపరచాలని చెప్పారు. సోమవారం అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను అర్ఐ కె.రాంబాబుతో కలిసి ఆయన పరిశీలించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రాజా

ప్రజాశక్తి - పాలకోడేరు

శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం శృంగవృక్షం నూతన అధ్యక్షునిగా గ్రంధి రాజా ఎన్నికయ్యారు. గతంలో సంఘ అధ్యక్షునిగా పని చేసిన అత్యం సూర్యప్రకాశరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన స్థానంలో రాజాను ఎన్నుకున్నారు. సంఘ పెద్ద కూర్మాల నారాయణరావు ఈ ఎన్నికలు నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన గ్రంధి రాజాను సంఘ సభ్యులు అభినందించారు. గ్రంధి రాజా మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సభ్యులుగా అమరా కృష్ణప్రసాద్, కూర్మాల వెంకట శ్రీనివాసరావులను కమిటీలోకి తీసుకుంటున్నట్లు గ్రంధి రాజా తెలిపారు.

పాలకొల్లు నియోజకవర్గంలో 1,93,369 మంది ఓటర్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో ఫైనల్‌గా 1,93,379 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తుది ఓటర్ జాబితా సోమవారం విడుదల చేసింది. ఓటర్ జాబితాలను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఉంచారు. వీరిలో 95,079 మంది పురుషులు ఉండగా 98,293 మంది మహిళలు ఉన్నారు. ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. గతంలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయగా 1,92,337 మంది ఓటర్లు ఉన్నారు.

సిద్ధాంతంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని సిద్ధాంతం పంచాయతీ పరిధిలో బూరుగుపేట, చెరువుపేట, నక్కవారిపాలెం, పెద్ద పేట కాలనీలో సోమవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయమన్నారను. ఈ కార్యక్రమంలో జనసేన కన్వీనర్ చేగుంట సూర్యప్రకాష్, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్, ఉండవెల్లి శ్రీను, టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌ల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు సిబ్బంది అవగాహన కల్పించాలని గృహ నిర్మాణ శాఖ ఇఇ బివి.రమణ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో జగనన్న లే అవుట్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు డిఇఇ వెంకటేశ్వరరావు, ఎఇ ఫణీంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

మహనీయుడు లెనిన్

లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రపంచ విప్లవకారుడు, సోవియట్ రష్యాలో మొట్టమొదటి సోషలిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు యోధుడు లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని చించినాడ గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో సూర్యారావు మాట్లాడారు. సోవియట్ యూనియన్‌లో మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఒక్కసారిగా ప్రపంచం తమ వైపు చూసేలా చేసిన మహనీయుడు లెనిన్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కానేటి బాలరాజు, దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, గూడూరి నాగేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో కల్లుగీత కార్మిక సంఘం మహాసభ

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 30, 31 తేదీల్లో తణుకులో జరిగే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు బొక్కా చంటి, కడలి పాండు పిలుపునిచ్చారు. ఆచంటలో కల్లుగీత కార్మికుల డివిజన్ సమావేశం స్థానిక సుబ్రహ్మణ్యం ఆలయం వద్ద కల్లుగీత కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గీతవృత్తిని ఆదుకోకపోగా ఉన్న ఉపాధిని దెబ్బతీసి తీవ్ర ద్రోహం చేస్తుందని వాపోయారు. కరోనా కష్టకాలంలో కల్లుగీత కార్మికులపై అక్రమ కేసులు, బైండవర్ కేసులు పెట్టి 40 రోజులు కల్లు తీయకుండా గీత కార్మికులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి అనుసరిస్తున్న కల్లుగీత వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే రాష్ట్ర మహసభలో సుదీర్ఘంగా చర్చించి భవష్యత్తు కార్యాచరణ రూపొంది స్తామన్నారు. ఈ మహాసభకు పెద్దసంఖ్యలో గీత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆరుపల్లి వెంకటనారాయణ, జక్కంశెట్టి సత్యనారాయణ, దొంగ నాగేశ్వరరావు, జుత్తిగ వీరవెంకటసత్యనారాయణ, నార్గన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం

ఆడపిల్లలు మంచి స్పర్శ, చెడు స్పర్శల మధ్య తేడాను గమనించాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సంస్థ సభ్యులు చల్లా దానయ్యనాయుడు అన్నారు. జెండర్ సెన్సిటైజేషన్, ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్ అంశంపై అవగాహన కల్పించేందుకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టేలర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు దానయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నారిన శ్రీనివాసరావు, ఉచిత న్యాయవాది నక్కా ఆనందబాబు, సంస్థ సంఘ సేవకులు సతీష్‌కుమార్, స్కూలు ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

ఆదర్శంగా భీమవరం పట్టణాభివృద్ధి

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రెండో పట్టణంలో సుమారు రూ.1.60 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణంలో ఏ వార్డుకు వెళ్లినా సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలను ప్రజల సూచనల మేరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. తొలుత రూ.64 లక్షలతో శ్రీ అభిరుచి హోటల్ నుంచి శ్రీరామపురం కల్వర్టు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం రోడ్డు వరకు నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. అనంతరం 32వ వార్డు చెట్టు కింద సాయిబాబా ఆలయం వద్ద రూ.42.30 లక్షలతో వినాయక విగ్రహం నుంచి నేతాజీ వీధి వరకు నిర్మించిన సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్‌ను, ఇదే వార్డులో సీసలి రూ.13 లక్షలతో ప్రశాంతి నగర్ ఏరియాలో ఎస్ఎల్‌వి టవర్స్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును రూ.25 లక్షలతో ప్రశాంతి నగర్‌లోని నేతాజీ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్స్ స్లాబ్ కల్వర్టును, 31వ వార్డులో రూ.16.50 లక్షలతో నిర్మించిన బీసీ కాలనీ మెయిన్ రోడ్డును ప్రారంభించారు. నాలుగున్నరేళ్లగా రూ.వంద కోట్లకు పైబడి నిధులను భీమవరం పట్టణాభివృద్ధికి ఖర్చు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంఇఇ త్రినాధరావు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, రెండో పట్టణ జెసిఎస్ కన్వీనర్ గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కొప్పర్తి వీరరాఘవులు, కామన నాగేశ్వరరావు, ఎఎస్.రాజు, కొల్లి ప్రసాద్, రేవూరి గోగురాజు, బొర్రావాసు, చెన్ను చంటి, చెల్లబోయిన సూర్యప్రకాష్, నందమూరి ఆంజనేయులు, పళ్ల ఏసుబాబు, తాళ్లపూడి పరమేశ్వరరావు, ముద్దే రామభద్రగౌడ్, నిమ్మల బాలసుబ్రహ్మణ్యం, ఎం.శ్రీను, ఉయ్యూరు వెంకన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న గ్రంధి శ్రీనివాస్

ఇండియా బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత చేతనకు అభినందన

ప్రజాశక్తి - ఉండి

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించుకున్న బొలిశెట్టి చేతనకు స్థానిక ఎంఎల్ఎ మంతెన రామరాజు అభినందనలు తెలిపారు. సోమవారం అయోధ్య బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఉండి ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఉన్న శ్రీరామ క్షేత్రంలో చిన్నారి చేతనచే ఆలయ నిర్వాహకులు భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ ఏడేళ్ల వయస్సులోనే వందకు పైగా భగవద్గీత పారాయణాలు చేసిన చిన్నారి చేతనను అభినందించారు. చేతన ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకోవడం విశేషమన్నారు.

కాళ్ల : దాతల సహకారంతో ప్రసాదం వితరణ చేయడం అభినందనీయమని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. అయోధ్యలో బాల రాముని ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా కాళ్లకూరులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో చక్కెర పొంగలి, పులిహోర, దద్దోజనం ప్రసాద వితరణ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స సోమరాజు (కోస్టల్ సోమరాజు), పెన్మత్స కుమార్‌రాజు, గాదిరాజు మురళీకృష్ణంరాజు, పెన్మత్స సత్యనారాయణరాజు, పి.చంద్ర శేఖర్‌రాజు, కమ్మిలి పవన్, నారాయణరాజు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేతనను అభినందిస్తున్న ఎంఎల్ఎ

భీమవరం రూరల్ : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని క్షత్రియ యూత్ స్థానిక అడ్డ వంతెన వద్ద భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ యూత్ నాయకులతో పాటు వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



కాళ్లలో ప్రసాద వితరణ

పాలకొల్లు : అయోధ్యలో జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా పాలకొల్లు పట్టణంలో సోమవారం పలు కూడలిలో అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి యర్రంశెట్టి పద్మారావు, పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, కబర్ధి, డాక్టర్ ముచ్చర్ల సంజయ్ పాల్గొన్నారు.

పెనుగొండలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుగొండ

మాక్స్ విజన్ ఐ హాస్పిటల్స్ భీమవరం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం స్థానిక ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కంటి పరీక్షలు చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవివి.అప్పారావు తెలిపారు. దృష్టి దోషాలు అనేక రకాలుగా ఉన్నాయన్నారు. పౌష్టికాహార లోపం, షుగర్ సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల కంటిచూపు లోపిస్తున్న కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు కంటి వైద్య శిబిరాన్ని ఉపయోగించుకుని డాక్టర్లు ఇచ్చిన సూచనల మేరకు కళ్లజోళ్లు, మందులు వాడుతూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శిబిరం రెండు రోజులు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ పోలిశెట్టి శ్రీహరి, పవన్, కళాశాల సిబ్బంది సూర్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.దివాకర్, ఆర్ఎన్.శ్రీనివాస్, పి.మీరయ్య, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, అధ్యక్షులు పితాని సూర్యనారాయణ, ఉద్దగిరి రవికుమార్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో స్థానిక 17వ వార్డు పట్టణ ప్రగతి యూనిట్ పేపర్ ప్లేట్లు తయారీ మిషనరీ సంస్థను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంలో భాగంగా జగనన్న మార్ట్‌లు, ఈ మార్ట్‌లు, అర్బన్ మార్కెట్‌లు చేయూత జీవనోపాధి యూనిట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిటీ మేనేజర్ నానిబాబు మాట్లాడుతూ ఎండి మెప్మా విజయలక్ష్మి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇమ్మన్యుల్ ఆదేశాల ప్రకారం ప్రతి మున్సిపాలిటీలో ఒక పేద మహిళను గుర్తించి, వారికి ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇచ్చి ఒక వ్యాపార యూనిట్ పెట్టాలని నిర్ణయించారు. ఇందుకు పట్టణ ప్రగతి యూనిట్‌గా పేరు నిర్ణయించారు. ఆ విధంగా భీమవరంలో నెహ్రూ స్లమ్ సమాఖ్యలో షర్మిల, సభ్యురాలు సిహెచ్.సుధారాణి ఆసక్తి కలిగి ఉన్నారు. వారికి విజయవాడలో కెఎల్ యూనివర్శిటీలో నాలుగు రోజులు పేపర్ ప్లేట్స్ తయారీలో ఉచిత శిక్షణ కల్పించి, భీమవరం పట్టణ సమాఖ్య ద్వారా తక్కువ వడ్డీకి రుణం పొంది యూనిట్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.నరసింహరాజు, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ కృపామణి, సిఎంఎం సిహెచ్ నానిబాబు, సిఒలు సంతోషమ్మ, జయకృష్ణ, పెద్దింట్లమ్మ, డిఆర్‌పి ఉమ, సమాఖ్య ఆర్‌పిలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

గణపవరం మండలం, సిహెచ్.అగ్రహారం గ్రామమునకు చెందిన బిక్కావుల రాజేష్ భార్య బిక్కావుల జ్యోతి అను నేను సిహెచ్.అగ్రహారం నుండి గణపవరం వచ్చి నా యొక్క పాస్‌పోర్టు నెంబరు **U0623452** పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకుని జిరాక్స్ మరియు ఒరిజినల్ పాస్‌పోర్టును కవర్లో పెట్టుకుని బండిపై గణపవరం నుండి సిహెచ్.అగ్రహారం వెళ్లే దారిలో కవర్‌తో సహా మార్గమధ్యలో పడిపోయినది. దారిలో ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బిక్కావుల జ్యోతి, భర్త: రాజేష్
సిహెచ్.అగ్రహారం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 6301413482

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 48/2023
ఒ.ఎస్. 160/2017

DHR:
దంతులూరి జోగి జగన్నాధరాజు
JDR:
రుద్రరాజు తులసి అన్నపూర్ణ, W/o. రామకృష్ణంరాజు, కలవపూడి, కాళ్ళ మండలం.

Order 5 Rule 20 C.P.C. ప్రకారం J.D.R. కు నోటీసు

పై నెంబరు ఇ.పి.లో J.D.R. కు కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అమలు జరగనందున కోర్టు వారు దావాను **ది. 01-02-2024వ తేదీకి వాయిదా వేసినారు.** కావున J.D.R. పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10 గంటలకు** హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసినదిగాను లేని పక్షంలో మీ పరోక్షంలో ఇ.పి. తీర్మానం కాబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
వాది తరుపు లాయర్
భీమవరం భీమవరం
ది.22-01-2024 సెల్: 9848539039

మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి, జంగారెడ్డిగూడెం వారి కోర్టులో
O.S. No. 241/2023

బిట్వీన్:
శ్రీమతి బొండ శిరీష -వాది
Vs
శ్రీ బొప్పినేటి లక్ష్మీనారాయణ -ప్రతివాది
To:
శ్రీ బొప్పినేటి లక్ష్మీనారాయణ, తండ్రి: గిరి రాజు, 45 సం॥లు, నాగులగూడెం గ్రామం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా గ్రంథంలో ప్రతివాదైన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినను వేర్వేరు కారణములు చూపుచు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పై గ్రంధంను **ది. 31-01-2024వ తేదీకి వాయిదా వేసినారు. ఆ రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** గౌరవ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.
(ది. 29-11-2023 తేదీన జారీ చేసిన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ప్రకటన జారీ చేయటమైనది)

యన్.వి.బి.యల్.ఆచారి, న్యాయవాది
పంగిడిగూడెం రోడ్, హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద,
జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం
21-01-2024 సెల్ 9440215126

గ్రామపంచాయతి కార్యాలయం, కలిదిండి
టెండరు ప్రకటన
ఆర్.ఓ.సి. నెం. 01/2024 **తేది.20-01-2024**

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కలిదిండి గ్రామపంచాయితీ నందు ఈ క్రింది పనులు 2024-25 సం॥నకు నిర్వహించుటకు గాను ది. 29-01-2024 తేది మధ్యాహ్నం గం॥ 12.00లకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను టెండర్లుదారుల సమక్షమున మధ్యాహ్నం గం॥ 12.30 ని॥లకు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయం నందు సంప్రదించవచ్చును.

వ.నెం.	పని వివరము	కావాల్సిన వ్యక్తులు	ధరావత్తు	పని కాలము
1	పారిశుద్ధ్య పనులు స్వీపర్లు-5 డ్రైవర్స్-2	7	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025
2	కాంట్రాక్టు వాచ్ మెన్ చెరువు కాపలా	1	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025
3	కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్లు	2	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025
4	కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ అసిస్టెంట్లు	2	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025

నోట్: 1. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను. 2. ఈ గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంటు ఇవ్వబడును. 3. గతంలో ఈ పంచాయితీలో పని చేసిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- **శ్రీ ఆర్.వి.ఉదయ్‌కుమార్**
పంచాయితీ కార్యదర్శి, కలిదిండి గ్రామపంచాయితీ

సం/- **శ్రీమతి ఎం.మారుతి ప్రసన్న**
సర్పంచ్, కలిదిండి గ్రామపంచాయితీ